క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

గండేపల్లి: హైవేపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు.. తుని నుంచి శ్రీశైలం ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు మండలంలోని మల్లేపల్లిలో బ్రిడ్జ్ డౌన్లో ముందు వెళుతున్న ఆటో, లారీని తప్పించే క్రమంలో రెండింటి మధ్యలోకి బస్సును డ్రైవర్ వెళ్లనివ్వడంతో అదుపు తప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. లారీకి ఎడమవైపు దెబ్బతినగా బస్సు వెనుక భాగంలో కుడివైపు స్వల్పంగా దెబ్బతిందన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బస్సు, లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

ప్రత్తిపాడు: మండలంలోని పోలీస్ సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ సూర్య అప్పారావు తెలిపారు. వీరిని మంగళవారం స్థానిక కోర్టులో హాజరుపరచగా.. 11 మందికి రూ.1.10 లక్షల జరిమానా, ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారన్నారు. ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అరెస్టు చేసిన ఆరుగురిలో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించారు. అన్నవరం స్టేషన్ పరిధిలో అరెస్టు చేసిన ఆరుగురిలో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించారు. ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి రూ.10 వేల జరిమానా, ఒకరికి 3 రోజుల జైలు శిక్ష న్యాయమూర్తి విధించారు. ముగ్గురు నిందితులను కారాగారానికి తరలించినట్టు తెలిపారు.

అధ్యాపకుల నిరసన

ఏలేశ్వరం: తమ డిమాండ్లు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం అధ్యాపకులు నిరసన తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బదిలీలతో పాటు అధ్యాపకులను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేషట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా నామకరణం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈనెల 18న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగడ ప్రయాగమూర్తి, వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడు క్షేమం

గండేపల్లి: సీహెచ్‌సీ వైద్యులు అత్యవసర చికిత్స అందించి బాలుడుని ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన గొర్రెల సాత్విక్ (12) సోమవారం మేడపై ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ శ్లాబ్‌పై పడిపోవడంతో ఊచ కుడివైపు బీజంలో గుచ్చుకుంది. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించినప్పటికీ తగ్గకపోవడంతో మంగళవారం గండేపల్లి మండలం చక్రవర్తి నగర్‌లో ఉన్న సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యులు ప్రణీత్, వినూష వరిబీజం తొలగించకుండా అత్యవసర చికిత్స అందించి ఇన్‌ఫెక్షన్‌ను తొలగించారు. ప్రణీత్ మాట్లాడుతూ, బాలుడికి ఎలాంటి అపాయంలేదని, ప్రస్తుతం కోలుకుంటున్నాడని తెలిపారు.

గురితప్పిన గురుకులం

- జూనియర్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి
- ఇప్పటికీ ఖాళీగా 23 సీట్లు
- వసతుల లేని కారణంగా తగ్గుతున్న ఆదరణ



వి.కొత్తూరులోని అంబేద్కర్ గురుకుల కళాశాల

తుని రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా కోర్సులు లేకపోవడం, వసతి గృహాల సదుపాయం లేక విద్యార్థులు గురుకుల జూనియర్ కళాశాలలో చేరేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ కావడంలేదు. తుని మండలంలోని వి.కొత్తూరులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, హంసవరంలో ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. అధిక శాతం విద్యార్థులు ఎంపీసీ, సీఈసీ, బైపీసీ చదువుతుండగా ప్రభుత్వం ఎంఈసీ తరగతులు నిర్వహిస్తుంది. బైపీసీ విద్యార్థులు అత్యధికంగా ప్రైవేట్ కళాశాలల్లో చేరుతుండగా ఎంపీసీ, సీఈసీ సీట్లలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చేరుతున్నారు. ఎంఈసీలో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతుండటంతో అధిక సంఖ్యలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. ఈ పరిస్థితి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు దృష్టి సారించట్లేదని ఆరోపణలున్నాయి. విద్యార్థుల అభిరుచికి అనువుగా సీట్లు పెంచాలని కోరుతున్నా పట్టించుకోవట్లేదు. ఆయా కళాశాలల్లో సీట్ల భర్తీకి నేటికీ అడ్మిషన్లను స్వీకరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

వి.కొత్తూరులో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 40 ఎంఈసీ సీట్లలో నేటికీ 23 సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ఎన్ని సార్లు ప్రకటనలు జారీ చేసినా విద్యార్థులు చేరడంలేదు. గతేడాది మొదట సంవత్సరం (ఇప్పుడు ద్వితీయ సంవత్సరం) సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి. డిమాండ్‌కు అనుగుణంగా ఎంపీసీ సీట్లు కేటాయించాలని ఆయా వర్గాల విద్యార్థినులు కోరుతున్నారు. హంసవరంలో ఉన్న రాష్ట్ర ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్)లో 40 చొప్పున ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ సీట్లు ఉండగా ఎంపీసీ సీట్లు నిండుకున్నాయి. బైపీసీ, సీఈసీ, ఎంఈసీ సీట్లు 50 శాతం వరకు భర్తీ అయ్యాయి. విద్యార్థులకు వసతి సౌకర్యం లేకపోవడం, ఇంటి నుంచి రోజు వెళ్లి రావడం కష్టంగా మారింది. ఉన్న హాస్టల్‌లో వందమంది విద్యార్థినులకే వసతి సదుపాయం ఉండటం, తొమ్మిది, పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులతో నిండుకుంటుంది. 9, 10, ఇంటర్ విద్యార్థులు 320 మంది ఉండగా వసతి గృహంలో ఉండేందుకు వందమందికే అవకాశం ఉంది. దీంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాస్టల్ వసతి కరువవుతుంది. ఫలితంగా ఇంటర్మీడియట్ సీట్లు భర్తీ కావడంలేదు. ఉన్నత అధికారులు స్పందించి వసతి గృహంలో సీట్ల సంఖ్య పెంచాలని, జూనియర్ కళాశాలలో ఎంపీసీ సీట్లు పెంచాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వి.కొత్తూరులో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఉన్న 40 ఎంపీసీ సీట్లకు డిమాండ్ ఉండటంతో మొదట విడతలోనే సీట్లన్నీ పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి.

స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం

అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో మొదట సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 23 ఎంఈసీ సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటికి రిజర్వేషన్ కేటగిరి ఆధారంగా స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. విద్యార్థినులు పదో తరగతి మార్కుల జాబితా, ఆయా రిజర్వేషన్ల ధ్రువీకరణ పత్రాలతో నేరుగా వచ్చి చేరవచ్చు.

– ప్రసన్నరాణి, ప్రిన్సిపాల్, అంబేడ్కర్ గురుకుల కళాశాల, వి.కొత్తూరు.

జగన్‌ను కలిసిన శ్రీనివాస్



జగ్గంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నువ్వే మా క్రష్ జగనన్న పాట నిర్మాత పెంకే శ్రీనివాస్ తాడేపల్లిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ తెలిపారు. తాను రచించిన పాటను యూట్యూబ్‌లో అప్లోడ్ చేశామని, ఈ పాటకు అమృత రెస్టారెంట్ అధినేత పెంకే శ్రీనివాస్ నిర్మాతగా ఉన్నారని చెప్పారు.

ఆంజనేయస్వామికి పూజలు

ఏలేశ్వరం: శ్రావణమాసం పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం మహిళలు పారాయణ పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పరిషత్ దుర్గావాహిని, మాతృశక్తి సంఘాల మహిళలు హనుమాన్ చాలీసా, భగవద్గీత, భక్తిపాటలు ఆలపించారు. అనంతరం స్వామి వారికి తమలపాకులు, సింధూర పూజలు చేశారు.

గెలుపు కోసం రిగ్గింగ్ చేశారు

- మాజీ మంత్రి తోట నరసింహం


అనుబంధ సంఘాల నేతలను సత్కరిస్తున్న నరసింహం

జగ్గంపేట: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ హుందాతనాన్ని తాకెట్టు పెట్టి కూటమి కమిషన్‌గా వ్యవహరిస్తోందని, కడపలో జరిగినవి ఎన్నికలని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ, కడపలో జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలు, అభ్యర్థిని ఓటు వేయకుండా పోలీసులు అడ్డుకున్న తీరు దారుణమన్నారు. ఎన్నికల కమిషన్ కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గెలిచామని చెప్పకోవడం కోసం తప్ప కడప జిల్లాలోని పులివెందుల, ఒట్టిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగినవి కావన్నారు. నామినేటెడ్ పదవులు ఇచ్చినట్లుగా కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థులను జెడ్పీటీసీలుగా ప్రకటించుకొనుంటే ఎన్నికల ఖర్చు, అధికారులకు యాతన తప్పేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలతో మోసం చేసి గెలిచారని, ఇప్పుడు రిగ్గింగ్ చేసి ఎన్నికలు పూర్తి చేశారని ఆరోపించారు. అనంతరం అనుబంధ సంఘాలకు ఎంపికైన వారిని నరసింహం పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు వరుపుల సూరిబాబు, నియోజకవర్గ నేతలు కరుటూరి వీర్రాజు, రావుల గణేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

పలువురికి అభినందనలు

గోకవరం: వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాలకు ఎన్నికైన పలువురిని ఆ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం అభినందించారు. మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన బొర్రా శేఖర్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు కోసిన అరుణకుమార్ మంగళవారం జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా నియమితులైన వారిని ఆయన అభినందించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తోలేటి రాంప్రసాద్, నాయకులు ఇనకోటి దివాణం తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యంగా ఉండాలని పూజలు

రౌతులపూడి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంగా ఉండాలని గిడజాంలో పలువురు మహిళలు మంగళవారం లలితా పారాయణం పఠించారు. స్థానిక పుంతలో ముసలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో పూజలు చేసి ఆయన క్షేమంగా ఇంటికి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పుణ్యమంతుల లోవ దొర, సుంకర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనంతా మోసపూరిత చరిత్రే


బెండపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న యనమల కృష్ణుడు

తొండంగి: అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చిన చంద్రబాబు పాలనంతా మోసపూరిత చరిత్రేనని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మంగళవారం బెండపూడిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌తోపాటు 143 సంక్షేమ పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. 2014లోనూ మీ ఇంటి పెద్ద కొడుకునంటూ అప్పులన్నీ తీరుస్తానని అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఆయన పాలన చరిత్ర అంతా ప్రజల్ని నమ్మించి మోసం చేయడమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటా బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో జగన్ అందించిన పథకాల ద్వారా లబ్ధిని, చంద్రబాబు చేసిన మోసాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన డిగ్రీ విద్యార్థులు


శామ్యూల్ జానాధన్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

తుని రూరల్: సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో వి.కొత్తూరులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత మంగళవారం తెలిపారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించారు. కళాశాల, జిల్లా, జోనల్ స్థాయిల్లో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులు సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులు పి.వైష్ణవి, శేఖర్, కె.మౌనిక సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.శామ్యూల్ జానాధన్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు బొత్స నాగరాజు, పద్మావతి, భారతి అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


డి.పోలవరంలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న హెచ్‌ఓ, రైతులు

తుని రూరల్: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన అధికారి సుజాత అన్నారు. మంగళవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డి.పోలవరంలో ఆయిల్‌పామ్, అంతర పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ తోటల విస్తరణలో భాగంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఎకరాకు 50 నుంచి 57 మొక్కలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్‌కు మొదట నాలుగు సంవత్సరాలు ఎకరాకు సంవత్సరానికి రూ.2,100 ఎరువులకు, అంతర పంటల సాగుకు రూ.2,100 చొప్పున రాయితీ అందిస్తామన్నారు. అంతర పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న, అరటి, నువ్వులు, అపరాలు సాగు చేసుకోవచ్చన్నారు. రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు లభిస్తాయని, ఆసక్తి గల రైతులు ఆర్‌ఎస్‌కేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పతంజలి మేనేజర్ వెంకటేశ్వరరావు, చక్రధర్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది శ్యామల, రైతులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఎన్నో ప్రయోజనాలు

జగ్గంపేట: మండలంలో పామాయిల్ సాగుకు ఎంతో అనుకూలంగా ఉందని, పామాయిల్ సాగు చేసే రైతులకు అనేక ప్రయోజనాలు ప్రభుత్వం చేకూరుస్తోందని జగ్గంపేట ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి తెలిపారు. మండలంలోని మామిడాడలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామాయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు, పామాయిల్ మొక్కలు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీవల్లి మాట్లాడుతూ, పామాయిల్ సాగుచేసిన రైతులు ఆధునిక పద్ధతులు, అంతర పంటలు సాగు వల్ల మంచి దిగుబడులు, అధిక ఆదాయం లభిస్తోందని తెలిపారు. పామాయిల్ సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ అన్ని విధాల సాంకేతిక సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనజర్ ఏఎస్ ప్రకాష్ మాట్లాడుతూ, పామాయిల్ సాగుకు ఈ ప్రాంతం ఎంతో మేలు అయిందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా సాగులో 30 నెలలకే రైతులు గెలలు సేకరిస్తున్నారని చెప్పారు. పామాయిల్ సాగులో ఏపీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. రైతులకు పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సమీకరాలు సీత, ఆయిల్‌పామ్ టెక్నికల్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ మేలు


ధర్మవరంలో మల్బరీ పంటను పరిశీలిస్తున్న భువనేశ్వరి

ప్రత్తిపాడు రూరల్: వాణిజ్య పంటలకన్న పట్టు పరిశ్రమ ఎంతో మేలని పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ భువనేశ్వరి అన్నారు. మండలంలోని ధర్మవరం మల్బరీ పంటను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో పట్టు పరిశ్రమను ప్రారంభించి అధిక లాభాలు పొందవచ్చన్నారు. మల్బరీ సాగులో మేలైన సాగు పద్ధతులను పాటించడం వల్ల ఆకుల నాణ్యత, పంట దిగుబడి ఆధారంగా పట్టు పురుగు అధిక గూళ్లను పెడతాయన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న చినదివాణం

రౌతులపూడి: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్, విద్య వంటి మౌళిక సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అధికారులకు సూచించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా అందించే విద్యుత్ మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో అందట్లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారులు దృష్టి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ, మండలంలోని ఖరీఫ్‌లో చేపట్టిన సాగు విస్తీర్ణం, ప్రభుత్వం అందించే రాయితీ వంటి పథకాల గురించి వివరించారు. గత ప్రభుత్వంలో కౌలు రైతులకు రైతు భరోసా పథకం వర్తింపజేసిందని కూటమి ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి భరోసా కల్పించలేదని టీబీ పట్నం సర్పంచ్ సత్యనారాయణ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ ఏడాది విద్యావిధానంపై ఎంఈఓ–2 గాడి కొండబాబు వివరించారు. ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌందర్య, సీహెచ్‌సీ వైద్యాధికారిణి సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, రౌతులపూడి ఏఈ చినబాబు, ఉద్యానవన శాఖ ఇన్‌చార్జ్ దివ్యశ్రీ, వారి శాఖల పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ బాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి సాయి, సర్పంచ్‌లు సర్నం శ్రీను, రాపర్తి రామకృష్ణ, ఎంపీటీసీలు రాయి వెంకటలక్ష్మి, దెయ్యాల బేబి, గెడ్డం వెంకటలక్ష్మి, గాది రాజుబాబు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఏలేశ్వరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, 19 ఏళ్లలోపు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులి పురుగుల నివారణతో విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, మైరాల కనకరావు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌందర్య ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ డీ వార్మింగ్ టాబ్లెట్లు అందించారు. నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో ఇబ్బంది పడతారని డా.సౌందర్య అన్నారు. వైద్యుల సూచనల మేరకు ప్రతి విద్యార్థి డీ వార్మింగ్ టాబ్లెట్ వేసుకోవాలని సూచించారు.

జగ్గంపేట: చిన్నారుల రక్తహీనతకు నులి పురుగులే కారణమని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనసరిగా నులిపురుగుల మాత్రలు వేయించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ లక్ష్మి తెలిపారు. జగ్గంపేటలోని శెట్టిబలిజీ పేటలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నులిపురుగుల మందు పిల్లలకు వేసే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆల్బెండజోల్ 400 వేయడం వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. పూర్ణిమ మాట్లాడుతూ, మంగళవారం నులిపురుగుల మందు వేయించుకోని వారు ఆగస్టు 20న వేయించుకోవాలన్నారు.

నలుగురి అరెస్టు

గండేపల్లి: పాడి గేదెల చోరీకి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. అశ్వరావుపేటకు చెందిన చరణ్, తిరుపతి, కుమార్, వీరేంద్ర మండలంలోని ఉప్పలపాడులో నాలుగు గేదెలను దొంగతనం చేశారన్నారు. వీరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి దోస్త్ వాహనం, బైక్, గేదెలను స్వాధీనం చేసుకున్నామని, గేదెల విలువ రూ.లక్ష 60 వేలు ఉంటుందన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కిర్లంపూడి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ మంగళవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రావాలని ఆయన కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ, తక్షణమే పీఆర్సీ కమిషన్ వేయాలన్నారు. వేతన సవరణ పూర్తయితే రెండేళ్లు దాటడంతో వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నా లుగు డీఏలు ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న సుమారు 8 వేల పోస్టులను భర్తీ చేయాలన్నారు. వీటితో పాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తుని రూరల్: రాష్ట్ర కమిటీ పిలుపుతో తుని ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మంగళవారం ధర్నా అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, రెండేళ్లైనా వేతన సవరణ జరగనందున ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేట–2 డిపో స్థలాన్ని లులూ సంస్థకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు జరపాలన్నారు. ఖాళీగా ఉన్న 8 వేల పోస్టులను డైరెక్టుగా నియమించాలన్నారు. మహిళా ఉద్యోగులు, గ్యారెజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో అంతర్జాతీయ యువజన, గ్రంథపాలకుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, ప్యానల్ డిస్కషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి గ్రంథాలయ పితామహుడు రంగనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సొసైటీలో హర్ ఘర్ తిరంగా

గోకవరం: భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 78 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గోకవరం విశాల సహకార పరపతి సంఘం కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘం చైర్మన్ గాజింగం సత్తిబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సొసైటీ సీఈఓ దాసరి సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను పరిశీలించిన డీవైఈఓ

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూలును మంగళవారం విద్యాశాఖ డీవైఈవో ప్రభాకర శర్మ ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలోని ఫార్మేటివ్–1 పరీక్షలకు సంబంధించి నిర్వహణ తీరు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

తుని రూరల్: విద్యుత్ లైన్లలో మరమ్మతులు, నిర్మాణ పనులు చేస్తున్నందున బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ డి.వీరభద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేఖవానిపాలెం ఫీడర్‌లో వి.కొత్తూరు, లోవకొత్తూరు, కొత్త వెలంపేట, మరువాడ ఫీడర్‌లోని కుమ్మరిలోవ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గృహ వినియోగదారులు, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయదారులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

గోకవరం: మండలంలోని మల్లవరం ఫీడర్‌ను ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా కొత్తలైన్ ఏర్పాటు చేస్తుండటంతో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ జేబీబీ నటరాజన్, ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తపల్లి, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాధపురం, మల్లవరం, భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్త గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ఏలేశ్వరం: పట్టణంలో మంగళవారం లింగంపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్యప్రభ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జనసేనలో అసంతృప్తి

పార్టీ అవిర్భావం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా కష్టపడిన వ్యక్తి (ఒకప్పటి ఇన్‌చార్జ్)ని సంప్రదించకుండా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడంపై అసంతృప్తి నెలకొంది. నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు సైతం అ నాయకుడిని కలవకపోవడంపై పార్టీ శ్రేణులు గుర్రుగా ఉన్నారు. ఇన్‌చార్జ్‌గా ఉన్న వ్యక్తి ద్వారా గుర్తింపు పొంది ఇప్పుడు పట్టించుకోవట్లేదని చైర్మన్‌పై పార్టీ శ్రేణులు అసంతృప్తిగా ఉన్నారు.